

టీటీడీ ట్రస్టులకు రూ.30 లక్షల విరాళం

తిరుమల : టీటీడీలోని పలు ట్రస్టులకు శుక్రవారం రూ.30 లక్షలు విరాళంగా అందింది. దాతలు ఈ మేరకు విరాళం చెక్కులను తిరుమలలోని కార్యాలయంలో టీటీడీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డికి అందజేశారు. బెంగళూరుకు చెందిన దాతలు మంజునాథ రెడ్డి, కష్ణారెడ్డి కలిసి ఎస్.వి అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.20 లక్షలు, శ్రీ బాలాజి ఆరోగ్యవరప్రసాదిని స్కీమ్ కు ఆనందకుమార్ అనే భక్తుడు రూ.10 లక్షలు అందజేశారు. దాతలను ఛైర్మన్ అభినందించారు.

నిధుల్లేక...నీరసం..!

కష్టంగా రోజువారీ నిర్వహణ
జనంలోకి వెళ్లేందుకు సర్పంచులకు జంకు

ప్రజాశక్తి - గూడూరు

ఒకప్పట్లో సర్పంచి అంటే ఆ పంచాయతీకి 'కింగ్'... పంచాయతీ అభివృద్ధి పనులు జరగాలంటే ఆయన 'చెక్'కూ పవర్ ఉండేది.. కోట్లల్లో పనులు జరిగితే కనీసం లక్షల్లో కమీషన్ మిగిలేది.. అందుకే పంచాయతీ ఎన్నికలకు అంతటి ప్రాధాన్యత ఉండేది.. ఎన్నికలపుడు మేజర్ పంచాయతీలకు కోట్లు ఖర్చు పెట్టేవారంటే అతిశయోక్తి కాదు.. అలాగే ఉంటుందని వైఎస్ఆర్ కాంగ్రెస్ హయాంలోనూ భావించారు.. లక్షలు ఖర్చు పెట్టి మెజార్టీ పంచాయతీలను ఏకగ్రీవం చేసుకున్నారు.. అయితే ఏం లాభం... 'రబ్బర్ స్టాంపుల్లా' మిగిలిపోయారు.. సర్పంచుల చేతిలో రోజువారి పనులకూ రూపాయి లేని పరిస్థితి. మింగలేక, కక్కలేక, నిధుల్లేక సర్పంచులు బాధను లోలోనే దిగమింగుతున్నారు. సచివాలయాలు రావడంతో వాలంటీర్ల వ్యవస్థతో సర్పంచులు 'డమ్మీ'లుగా మిగిలామన్న వేదన వారిలో గూడు కట్టుకుపోయింది. పంచాయతీల్లో ఆర్థిక సంక్షోభం నెలకొంది.

ఆదాయ వనరులు అంతగా లేని చిన్న గ్రామ పంచాయతీల నిర్వహణ కత్తిమీద సాములా మారింది. ఖాతాల్లో నిధులు లేకపోవడంతో రోజువారీగా పారిశుధ్య పనుల నిర్వహణా కష్టంగా మారింది. గ్రామ ప్రథమ పౌరులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. బకాయిలపై ప్రశ్నించాలంటే భయం. ఎక్కడ రాజకీయంగా ఇబ్బందులు పెడతారోనని, పైగా సొంత పార్టీలోనే ఎలా అడగాలా? అనే మీమాంశ వారిలో ఉంది. లక్షలు ఖర్చు చేసి ఎన్నికల్లో గెలిస్తే ఆశించిన మేర పనులు జరగక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులూ పక్కదారి మళ్లాయన్నది వారి ఆవేదన. ఒకప్పట్లో ఏ పని కావాలన్నా సర్పంచి ఇంటి తలుపు తట్టేవారు. ప్రస్తుతం వాలంటీర్లను సంప్రదిస్తున్నారు. సచివాలయ వ్యవస్థను బలోపేతం చేయడం తమకు శాపంగా మారిందని వారు వాపోతున్నారు.

తాజాగా గ్రామాల్లో భూముల రీసర్వే జరుగుతోంది. రీసర్వే మొదలు భూముల రిజిస్ట్రేషన్ వరకూ సచివాలయ వ్యవస్థ పరిధిలోకి తెచ్చేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. 14, 15 ఆర్థిక సంఘం నిధులు సైతం దారి మళ్లడంతో గ్రామ ప్రజల అవసరాలు ఏవీ తీర్చలేని పరిస్థితి దాపురించింది. తాము సైతం వాలంటీర్లను ఆశ్రయించాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. 73, 74వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా సర్పంచులకు రాజ్యాంగబద్ధంగా, న్యాయబద్ధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం నుంచి దాఖలైన నిధులు, విధులు అధికారాలు ఇవ్వకపోగా, నిధులను సైతం దారి మళ్లిస్తున్నారు. తిరిగి ప్రజల వద్దకు ఏ మొహం పెట్టుకుని వెళ్లాలని ఇటీవల కాలంలో అక్కడక్కడ తిరుగుబాట్లు చేస్తున్నారు. గూడూరు నియోజకవర్గంలోని సర్పంచులు సైతం రాష్ట్ర ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు సమాయత్తం అవుతున్నట్లు తెలుస్తోంది. నిధులు, విధులు లేని ఈ పదవులు మాకొద్దు అని నిలదీయనున్నారు.

50 శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట ఎరువులు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

జూలై 26వ తేదీలోపు ఇ-కెవైసి ప్రక్రియ చేయించుకున్న రైతులకు పి.ఎం. కిసాన్ పథకానికి లబ్ది చేకూరుతుందని జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద రావు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్ లోని సమావేశ మందిరము నందు జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రైతు భరోసా కేంద్రాలు, రైతులకు వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లు, రాయితీ పై రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాల సరఫరా, కిసాన్ డ్రోన్లు, సరఫరా అంశాలపై విశదంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. 50 శాతం సబ్సిడీతో కంది, రాగి, పచ్చి రొట్టె ఎరువు వంటి విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. సజ్జ, మినుములు, పెసర, ఎన్ఎల్ఆర్= 3449, కెఎన్ఎం 1638, ఆర్ఎన్ఆర్ 5048 వంటి రకాలు రైతు భరోసా కేంద్రాలు అందుబాటులో కలవని అన్నారు. ఆంధ్రప్రదేశ్ మత్స్య సంపదలో ప్రథమ స్థానంలో ఉందని, చేపల ఉత్పత్తి అంతా బయట రాష్ట్రాలకు సరఫరా అవుతుంది కావున ప్రభుత్వ సూచనల మేరకు 30 శాతం చేపల ఉత్పత్తిని మన రాష్ట్రంలోని వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద ఆక్వా హెర్బల్ రిటైల్ యూనిట్స్ ను 90 శాతం సబ్సిడీతో ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని అన్నారు. ఈ సమీక్షలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, జిల్లా సిరికల్చర్ అధికారి గీతారాణి, మైక్రో ఇరిగేషన్ శాఖ అధికారి సతీష్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన కలెక్టర్ సతీమణి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'మనం అందరం గ్రీన్ ఇండియాలో భాగస్వాములవుదాం' అని రాష్ట్ర ఐఎఎస్‌ల శ్రీమతుల సంఘం పిలుపు మేరకు తిరుపతిలో జాతీయ రహదారి పేరూరు వద్ద కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి సతీమణి కె.కల్యాణి, జేసీ డికె బాలాజీ సతీమణి పృథ్వీ కల్యాణి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, మొక్కలు నాటి వాటిని కాపాడాలని పిలుపునిచ్చారు. జాతీయ రహదారి నిర్మాణంలో నరికేసిన ప్రతి చెట్టుకు రెట్టింపు సంఖ్యలో చెట్లను నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ పీడీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల గడువు పొడిగింపు

తిరుపతి సిటీ : ఎస్ వి వైద్య కళాశాలలో రెండు సంవత్సరముల కాలవ్యవధి పారామెడికల్ కోర్సులకు దరఖాస్తులకు ఆగస్టు 19వ తేదీ వరకు పొడిగించిన్నట్లు అ కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధర దేవి తెలిపారు. స్థానిక ఎస్ఎంసి ప్రాంగణంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 2023-24 అకాడమిక్ ఇయర్ పారామెడికల్ , అడ్మిషన్లు ప్రారంభించమన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థిని, విద్యార్థులు రెండు సంవత్సరముల ఇంటర్మీడియట్ బై.పీ.సీ.లో ఉత్తీర్ణులైన, ఎం.పీ.సీ.లోఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ డిప్లమా కోర్సులకు అర్హులు. ఎస్ వి వైద్య కళాశాలలో మొత్తం 76 సీట్లు అందుబాటులో ఉన్నవి. డిప్లమా ఇన్ అనస్థీషియా టెక్నాలజీ -30 సీట్లు. డిప్లమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ-30 సీట్లు, డిప్లమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ -10 సీట్లు, డిప్లమా ఇన్ డార్క్ రూమ్ అసిస్టెంట్ -06 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అర్హులైన తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లా లోని విద్యార్థిని విద్యార్థులందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 9440879943 నెంబర్ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ (అలైడ్ హెల్త్ సైన్సెస్), డాక్టర్. ఎన్. మాధవి లత, అలైడ్ హెల్త్ సైన్స్ జూనియర్ అసిస్టెంట్ నీలా రెడ్డి, ఎస్ వి వైద్య కళాశాల పి. ఆర్. ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

వర్ష ప్రభావిత జిల్లాల్లో అప్రమత్తంగా ఉండండి

తిరుపతి టౌన్ : వర్ష ప్రభావిత జిల్లాలలో అప్రమత్తంగా వుండి మానవీయ కోణంలో ఆదుకోవాలని శుక్రవారం సాయత్రం వర్చువల్ విధానంలో కలెక్టర్లు, ఎస్‌పి లతో ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి సూచించారు. వర్ష ప్రభావిత జిల్లాలయిన ఏలూరు, కోనసీమ , ఎ.ఎస్.ఆర్ జిల్లాల కలెక్టర్లకు ముఖ్యమంత్రి సమీక్షిస్తూ పలు సూచనలు చేసారు. జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి, ఎస్.పి. పి.పరమేశ్వర రెడ్డి, జేసి డి.కె.బాలాజీ పాల్గొన్నారు.

సందేశాత్మకంగా సాంఘిక నాటక ప్రదర్శన

ప్రజాశక్తి-తిరుపతి సిటి

టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్, రాష్ట్ర సాంస్కృతిక శాఖ, భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సంయుక్త సహాకారంతో అభినయ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి నాటకపోటీల్లో ప్రదర్శిస్తున్న సాంఘీక నాటక పోటీలు సందేశాత్మకంగా సాగుతున్నాయి. స్థానిక మహతి ఆడిటోరియంలో శుక్రవారం రాత్రి జరిగిన ప్రదర్శనలో బాగంగా గుంటూరుకు చెందిన శ్రీఅమృతలహరి థియేటర్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'నాన్న నేనొచ్చేస్తా' సాంఘీక నాటక ప్రదర్శన అందర్ని ఆకట్టుకుంది. విద్య, ఉపాధి కోసం ఇతర ప్రాంతాల్లో ఉండే పిల్లలు పడుతున్న కష్టాలు, వారి వ్యథలను తెలిజేస్తూ సాగిన ఈ ప్రదర్శనకు ప్రేక్షకులు బ్రహ్మారథం పట్టారు. అందుకు ముందు హైదరాబాదుకు చెందిన శ్రీమురళీకృష్ణ సాంస్కృతిక కళా సంస్థ కళాకారులు 'వసంత రాజకీయం' పద్య నాటకాన్ని ప్రదర్శించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన కూచిపూడి, భరత నాట్యం, జానపద బృందాల పోటీలు ప్రేక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమంలో అబినయ్ ఆర్ట్స్ నిర్వహకులు మబ్బు సూర్యనారాయణరెడ్డి, బిఎన్.రెడ్డి, సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.

కళలను ప్రోత్సహిస్తున్న వారికి సహకరిద్దాం : మేయర్

అంతరించి పోతున్న కళలను ప్రోత్సహిస్తున్న వారికి ప్రతిఒక్కరూ సహకరిద్దామని తిరుపతి కార్పొరేషన్ మేయరు డాక్టరు శిరీషా పిలుపునిచ్చారు. అభినయ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ నాటక పోటీలలో భాగంగా శుక్రవారం రాత్రి ప్రముఖ మహిళలతో మహిళా సదస్సు నిర్వహించారు. స్థానిక మహతి ఆడిటోరియంలో ప్రొఫెసరు స్వరాజ్యలక్ష్మీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బిఎన్ రెడ్డి గత 23 సంవత్సరాలుగా జాతీయ నాటక పోటీలను నిర్వహించడం అబినందనీయమన్నారు. తిరుపతి అభివృద్ధి ఎంఎల్ఏ భూమన కరుణాకర్‌రెడ్డి సూచనల మేరకు కమీషనర్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ మెంబర్లు, అధికారులు, సిబ్బంది అందరూ కలిసి టీమ్ వర్క్‌గా చేస్తున్నామన్నారు. బిఎన్ రెడ్డికి కళల పట్ల ఉన్న తపనను తిరుపతి గంగజాతర సందర్భంగా తాను స్వయంగా చూశానన్నారు. గంగమ్మ జాతరకు సంబంధించిన వైభవాలను నాటక రూపంలో ప్రదర్శించాలని ఎంఎల్ఏ సూచించడంతో బిఎన్ రెడ్డి అనేక మంది కళాకారులతో కలిసి నెలల తరబడి శ్రమించి, మంచి నాటక ప్రదర్శనను ఇచ్చారని గుర్తు చేశారు. ఇలా కళలను బతికించాలని పోరాడుతున్న మహానీయులకు ప్రతి ఒకరు సహకరించాలని కోరారు. అంతుకు ముందు ప్రముఖ మిమిక్రీ కళాకారుడు విజయ్‌కుమార్ తన ప్రదర్శనతో ప్రేక్షకులు మైమరిపించారు. ఈ కార్యక్రమంలో విశ్వం విద్యాసంస్థల అధినేత్రి నగరిమడుగు తులసి, మహేశ్వరి, పద్మావతి, రాజ్యలక్ష్మీ, డాక్టరు అరుణకుమారి, భూమా పుష్పావతి, గీతా, తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ విండో డ్యూటీలను రద్దు చేయాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్

ఆర్టీలో సింగిల్ విండో డ్యూటీలను రద్దు చేయాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు జిలానీబాధ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. గూడూరు సిఐటియు కార్యాలయంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు, యూనియన్ నాయకులతో సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఆర్టీసీలో సింగిల్ విండో డ్యూటీలను రద్దు చేయాలని జిల్లా పరిధిలో చలో సత్యవేడు, చలో శ్రీకాళహస్తి చేపడతామన్నారు. ప్రభుత్వ జీవో 70, 71లలో కార్మికులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఆర్టీసీలో ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌లో ఏర్పాటు చేసి కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు కృష్ణారావు, మల్లికార్జున, శివకుమార్, భాగ్యలక్ష్మి, సిఐటియు పట్టణ అధ్యక్షులు రమణయ్య, ప్రధాన కార్యదర్శి సురేష్, మున్సిపల్ జిల్లా కార్యదర్శి గోపినాథ్, కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్, బి.చంద్రయ్య పాల్గొన్నారు.

రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనమివ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

ఆల్ ఇండియా డిమాండ్స్ డే సందర్భంగా తిరుపతి రైల్వేస్టేషన్ ఎదుట శుక్రవారం ధర్నా జరిగింది. రైల్వే ప్రైవేటీకరణ ఆపాలని, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నినదించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, నగర కార్యదర్శి కె.వేణు మాట్లాడుతూ తిరుపతి రైల్వేస్టేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం 26వేలు చెల్లించాలని, ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సదుపాయాలు సక్రమంగా అమలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పని ఒత్తిడి పెరిగిందని, నెలకు కనీసం సెలవు దినాలు కూడా ఇవ్వకుండా వేధిస్తున్నారన్నారు. ప్రశ్నించిన వారిపై కక్షసాధింపు చర్యలు చేస్తున్నారన్నారు. ఇదేవిధంగా కొనసాగితే భవిష్యత్‌లో కాంట్రాక్టర్లు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. రైల్వే కాంట్రాక్టు కార్మికుల నాయకులు పి.మునిరాజా కార్మికులతో సంతకాలు సేకరించి పై అధికారులకు పంపుతామని తెలిపారు. నాయకులు టి.సుబ్రమణ్యం, రమేష్, ఎన్‌డి శ్రీను, రఘు, పార్థసారథి, భాస్కర్ పాల్గొన్నారు.

పెద్దిరెడ్డిని ఇంటికి పంపుతా : రామచంద్రయాదవ్

ప్రజాశక్తి - రేణిగుంట

రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో తాను పుంగనూరు నుండి పోటీ చేసి రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఇంటికి పంపిస్తానని భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ తెలిపారు. భారత చైతన్య యువజన పార్టీ ఆవిర్భావం తర్వాత శుక్రవారం మొదటిసారి రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్న ఆ పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ ను బిసివై పార్టీ నాయకులు కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. విమానాశ్రయంలో రామచంద్ర యాదవ్ మీడియాతో మాట్లాడుతూ బిసివై పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలు అభిమానులను విమానాశ్రయంలోకి రాకుండా అడుగడుగునా పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. వైకాపా ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎండగడతామన్నారు. వైకాపా ప్రభుత్వంపై తమ పోరాటమని రామచంద్ర యాదవ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో బిసివై పార్టీ తరఫున అభ్యర్థులను నియమిస్తామని 175 స్థానాల్లో పోటీలో దిగుతామన్నారు. తమ పార్టీ జెండా అజెండాను ప్రతి గ్రామానికి తీసుకెళ్తామన్నారు. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియంత పాలనకు ఆరు నెలల్లో చరమ గీతం పాడతామన్నారు. అనంతరం రోడ్డు మార్గాన రామచంద్ర యాదవ్ పుంగనూరుకు బయలుదేరి వెళ్లారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ధర్నా

పుత్తూరు టౌన్ /తొట్టంబేడు : విద్యుత్ శాఖలో కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని డివిజన్ పరిధిలోని 14 మండలాలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు, విశ్రాంత ఉద్యోగులు పెద్దఎత్తున డివిజనల్ ఇంజినీర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. విద్యుత్ ఉద్యోగుల జెఎసి నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఇపిఎఫ్, జిపిఎఫ్ ఇవ్వాలని, డిఎలు, పిఆర్‌సి అమలు చేయాలని కోరారు. లేనిచో ఆగస్టు 10వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యు.పాండురంగయ్య, ఎ.శివకుమార్, హరిప్రసాద్, పి.చక్రవర్తి, షణ్ముగం, శంకరయ్య పాల్గొన్నారు.

తొట్టంబేడులో... నల్లబాడ్జీలతో విద్యుత్ కార్యాలయం ఎదుట చెన్నయ్ - శ్రీకాళహస్తి ప్రధాన రహదారిలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈఈ వాసిరెడ్డి, ఏడి సతీష్ బాబు, ఏఈ లు బాలాజీ, నాగరాజు, రాజేష్, కష్ణయ్య పాల్గొన్నారు.

'డాలర్' సబ్సిడీ పెట్రోల్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ డాలర్స్‌గ్రూప్ ఆఫ్ ఛైర్మన్ డాక్టర్ సి. దివాకర్‌రెడ్డికి పుట్టినరోజు పురస్కరించుకుని సబ్సిడీతో పెట్రోల్‌ను అందించారు. ఈ కార్యక్రమానికి పెట్రోల్ వినియోగదారుల నుంచి విశేష స్పందన లభించింది. దివాకర్‌రెడ్డి గత ఇరవై ఏళ్లుగా రియల్‌ఎస్టేట్ రంగంలో రాణిస్తూ ఎపి, తెలంగాణా రాష్ట్రాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం తన పుట్టినరోజు పురస్కరించుకుని లీటర్ 112 రూపాయలకే పెట్రోల్‌ను అందించారు. తిరుచానూరు రోడ్డులోని అర్బన్‌హాట్ పక్కనున్న కెజిఎన్ భారత్ పెట్రోల్ పంపు, చంద్రగిరి సమీపంలోని తొండవాడ వద్ద ఉన్న శ్రీ లక్ష్మీ ఫ్యూయల్స్‌లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ సబ్సిడీ పెట్రోల్‌ను వితరణగా అందించారు. స్నేహితులు, అభిమానులు భారీ కేక్‌ను ఆయన చేతుల మీదుగా కట్ చేయించి, శుభాకాంక్షలు తెలిపారు. డాలర్స్‌గ్రూపు ఏర్పాటు చేసి పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం చంద్రగిరి కోటకు ఎదురుగా ఉన్న మైదానంలో వేడుకలు జరుపుకోనున్నారు. టాలీవుడ్, బాలీవుడ్ సినీ కళాకారులు రానున్నారు.

ఎస్వీసిఈలో ఘనంగా ఫ్రెషర్స్ ఫెస్ట్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఇంజనీరింగ్ లో నైపుణ్యతతో కూడిన వారికి భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉన్నాయని బెంగళూరు సాటిలైట్ సెంటర్ పీఎంఎస్జీ-ఐఆర్ఎస్, ఎస్ఎస్ఎస్ గ్రూప్ డైరెక్టర్ హరినాథ్ అన్నారు. శుక్రవారం తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో 2022-23 ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ ఫెస్ట్(టెక్నో కల్చరల్ ఈవెంట్)ను ఘనంగా నిర్వహించారు. ఈ ఫెస్ట్ కు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి దాదాపు 1500 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హరినాథ్ మాట్లాడుతూ ఉద్యోగాలకు కావలసిన స్కిల్స్, అర్హతలు, లైఫ్ స్కిల్స్ పై విద్యార్థులకు ఉదహరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఇంజనీరింగ్ లో నిపుణత కలిగిన వారికి మంచి అవకాశాలు ఉన్నాయని, అకడమిక్స్ తో పాటు విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ అనేది చాలా కీలకమన్నారు. ఎస్వీసిఈ కళాశాల ఛైర్మన్ ఏ. గంగిరెడ్డి, వైస్ ఛైర్మన్ ప్రకాష్ అంబవరం, సెక్రటరీ ప్రదీప్ అంబవరం మాట్లాడుతూ విద్యార్థుల లక్ష్యాలకు అనుగుణంగా వారి నైపుణ్యాభివద్ధి కోసం అనేక శిక్షణా తరగతులు, నైపుణ్యాభివద్ధి కార్యశాలలు, హ్యాకథాన్ వంటి కార్యక్రమాలను నిత్యం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు పలు రకాల క్రీడలను నిర్వహించి విభాగాల వారీగా బహుమతులను అందించారు. కార్తీక్, ఆరి హంట్ గ్రూప్ తో డీజే ప్రోగ్రాంను నిర్వహించారు. సమన్వయకర్తలుగా డాక్టర్ ఎన్. మనోహర్ రెడ్డి, డాక్టర్ కె. వెంకటేశ్వరరాజు వ్యవహరించగా పాల్గొన్నారు.

టిటిడి పాలకమండలిపై కసరత్తు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



టీటీడీ ప్రస్తుత పాలక మండలి పదవీ కాలం ఆగస్టు నెలలో ముగియనుంది. ఆగస్టు ఏడో తేదీ చివరి పాలక వర్గ సమావేశం జరగనుంది. ఈ నేపథ్యంలో కొత్త పాలక మండలి కూర్పుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్ర కసరత్తు చేస్తున్నారని సమాచారం. ముఖ్యంగా పాలక మండలి ఛైర్మన్‌గా ఇంత వరకూ జంగా కష్ణమూర్తి, పార్థసారథి తదితరుల పేర్లపై విస్తతంగా ప్రచారం జరిగింది. ఎన్నికల ముంగిట కావడంతో సామాజిక సమీకరణలకు జగన్ పెద్ద పీట వేస్తారనే చర్చ జరుగుతోంది.

అయితే టీటీడీలో విప్లవాత్మక మార్పులకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చేలా అనుభవానికి ప్రాధాన్యం ఇచ్చే కోణంలోనూ జగన్ సీరియస్ ఆలోచిస్తున్నారని తాజా సమాచారం. అనుభవాన్నే పరిగణలోకి తీసుకుంటే సామాజిక సమీకరణలు పక్కకు పోతాయి. టీటీడీకి, హిందూ ధర్మానికి మేలు చేసేలా, కోట్లాది మంది భక్తుల ప్రయోజనాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తారో అలాంటి వారికి ఛైర్మన్ బాధ్యతలు అప్పగించే అవకాశాలు మెరుగుపడ్డాయి.

నూతన పాలక మండలిని ఏ క్షణాన్నైనా ప్రకటించే అవకాశం ఉంది. ఇంత వరకూ ఏ ఒక్క నాయకుడికి సీఎం జగన్ ఛైర్మన్ గిరిపై మాట ఇవ్వలేదు. జగన్ సర్కార్ వచ్చినప్పటి నుంచి ఆయన చిన్నాన్న వైవీ సుబ్బారెడ్డి టీటీడీ ఛైర్మన్‌గా కొనసాగుతూ వచ్చారు. ఉత్తరాంధ్ర వైసీపీ కోఆర్డినేటర్ బాధ్యతల్లో ఆయన వుండడంతో అక్కడ ఎక్కువ సమయాన్ని కేటాయించాల్సి వుంది. కొత్త ఛైర్మన్‌గా ఎన్నికయ్యే నాయకుడు భవిష్యత్‌లో ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండే అవకాశం వుంది. అలాంటి నాయకుడెవరో జగన్ దష్టిలో ఉన్నారని సమాచారం. తిరుపతి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి గురువారం సిఎం జగన్మోహన్‌రెడ్డిని కలవడం చర్చనీయాంశమయ్యింది. సీనియర్‌గా తనకు అవకాశం ఇవ్వాలని కోరినట్లు తెలుస్తోంది.

30న రైతుల సమస్యలపై సదస్సు

ప్రజాశక్తి-కేవీబీపురం: ఈనెల 30వ తేదీన రాష్ట్ర రాజధాని విజయవాడలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో అన్ని రైతు సంఘాలతో జరిగే రాష్ట్ర సదస్సులో రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్ పిలుపునిచ్చారు. శుక్రవారం కేవీబీపురం మండల కేంద్రంలో రాష్ట్ర సదస్సుకు సంబంధించి గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగం ఎదుర్కొంటున్న గిట్టుబాటు ధర, ఉచిత విద్యుత్తు, పంటల భీమా అమలు , రైతుల రుణమాఫీ అమలు తదితర అంశాలపై అఖిలపక్ష రైతు సంఘాలు.. నాయకులు అఖిలభారత కార్మిక కర్షక సంఘాల జాతీయ నాయకులు పాల్గొని మాట్లాడుతారని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి నాగరాజు, రైతు సంఘం నాయకులు నాగూరు, లక్ష్మయ్య, మనోహర్, కన్నెమ్మ, ఢిల్లీ బాబు తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ ప్రజలకు జగన్ ద్రోహం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రాయలసీమలో ఎన్నో ఇరిగేషన్ ప్రాజెక్టులు రద్దు చేసి రాయలసీమ జగన్మోహన్ రెడ్డి ప్రజలకు తీవ్ర ద్రోహం చేశారని నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడానికి తెలుగుదేశం కృషి చేసిందని.. సీమ ప్రాజెక్టుల కోసం రూ.12,411 కోట్లు ఖర్చు పెట్టారని..మళ్లీ అధికారంలోకి వచ్చుంటే అన్నీ ప్రాజెక్టులు పూర్తి చేసేవారమన్నారు. తెలుగు గంగ ప్రాజెక్ట్‌కు టిడిపి 2014-19 కాలంలో రూ.504 కోట్లు ఖర్చుపెట్టామని అధికారంలోకి వస్తే 2020 నాటికి పూర్తిచేస్తాం అన్న జగన్ హామీ ఎమైందో సమాధానం చెప్పాలి. హంద్రీనీవా ప్రాజెక్ట్ కు తెలుగుదేశం హయాంలో రు.4182 కోట్లు ఖర్చు చేస్తే..వైసీపీ కేవలం రు.515 ఖర్చుపెట్టి ,2020 నాటికి పూర్తి చేస్తామన్న హామీ ఏమైనట్టు అన్నారు. జగన్ పాలన పోవాలని.. తెలుగుదేశం వస్తేనే రాయలసీమకు న్యాయం జరుగుతుందని వివరించారు.

ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-నాయుడుపేట: రాఘవేంద్ర ట్రేడర్స్ అధినేత నెల్లూరు జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు సురేష్‌శెట్టిని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి.సంజీవయ్య పరామర్శించారు. కె.సురేష్ శెట్టి కొద్దిరోజుల క్రితం ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఎమ్మెల్యే అనుచరులతో వెళ్లి ఆయన కుమారుడు సురేందర్ శెట్టిని కలిసి పరామర్శించి ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, మునిసిపల్ చైర్ పర్సన్ దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి, కౌన్సిలర్ ధారా రవి, జయరామయ్య పాల్గొన్నారు.

అరవిందుల తత్వాన్ని అవగాహన చేసుకోవాలి

ప్రజాశక్తి-క్యాంపస్: భారతీయ తాత్విక చింతనను విశ్వవ్యాప్తం చేసిన అరవిందుల తత్వాన్ని ఈతరం యువత అవగాహన చేసుకోవాలని పలువురు అభిప్రాయపడ్డారు. అరవింద్ 150 వ జయంతి సందర్భంగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖలోని ఆచార్య జి.యన్ రెడ్డి సెమినార్ హాల్లో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు విభాగ సలహాదారు ప్రొఫెసర్ పేట శ్రీనివాసులు రెడ్డి, విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ, ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ సుమ కిరణ్, ఫిలాసఫీ విభాగాధిపతి ప్రొఫెసర్ చంద్రయ్య, విశ్రాంతాచార్యులు అబ్దుల్ సత్తార్, అరవిందో ఆశ్రమ సొసైటీ ప్రతినిధులు విక్రమ్, వేణుగోపాల్, రవి, రామచంద్ర తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ తరం యువత ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ప్రొఫెసర్లు శారద, ఉషారాణి, డాక్టర్ నాగులూరి దయాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

గూడూరులో మహాశక్తి రథం ప్రారంభం

ప్రజాశక్తి -గూడూరు : గూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో మాజీ శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో సమీక్షించారు. ఈ సందర్భంగా మహాశక్తి రథం ప్రారంభించి మాజీ ఎమ్మెల్యే పాశం ఇంటి నుండి నడిచి వస్తుండగా ఆయన వెంట దాదాపు 1000 మంది నాయకులు, కార్యకర్తలు కలిసి నడిచారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు గూడూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌ను ప్రకటించడంతో ఆయన్ను నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. మహాశక్తి రథంతో ఇంటింటికీ తిరిగి అత్యధిక మెజారిటీతో విజయం సాధించి నారా చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శీలం కిరణ్ కుమార్, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, వెంకటేశ్వర్లురెడ్డి, కిషోర్‌నాయుడు, యేసుపోగు పెంచలయ్య, మట్టం శ్రావణిరెడ్డి, గుండాల భారతి, గుండాల లీలావతి, మహాశక్తి మహిళలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీ సందర్శన

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని బేసిక్ అండ్ అప్లైడ్ సైన్సెస్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాజెక్టు రివ్యూ చేసేందుకు న్యూఢిల్లీకి చెందిన డి.ఎస్.టి వైజ్ కిరణ్ డివిజన్ నుంచి పది మందితో కూడిన విద్యార్థుల బందం మహిళా వర్సిటీని సందర్శించిందని రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజిని వెల్లడించారు. బోధనా సిబ్బంది, పరిశోధక విద్యార్థినులతో మరియు పీజీ విద్యార్థులతో క్యూరీ ల్యాబ్ లోని పరిశోధక పరికరాల ఉపయోగం గురించి అడిగి తెలుసుకున్నారు. క్యూరీ కన్వీనర్ ఆచార్య సువర్ణలత దేవి, ఆచార్య ఎస్ స్. జ్యోతి క్యూరీ ప్రాజెక్ట్ పురోగతిని రివ్యూ బందానికి తెలిపారు. వర్సిటీ వైస్ ఛాన్సలర్ భారతి, బోధనా సిబ్బంది రివ్యూ బందాన్ని సత్కరించారు.

అభివృద్ధి పథంలో శెట్టిపల్లి..!

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతి అర్బన్ మండలంలో మేజరు పంచాయతీగా ఉన్న శెట్టిపల్లి, తిరుపతి కార్పొరేషన్‌లో విలీనం అయిన తర్వాత అభివృద్ధి పథంలో దూసుకెళుతోంది. వివాదాస్పదంగా మిగిలిపోతున్న శెట్టిపల్లి భూముల విషయంలో స్థానిక ఎంఎల్ఏ భూమన కరుణాకర్‌రెడ్డి చొరవతో తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయరు భూమన అభినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థులతో చర్చించి, పంచాయతీని కార్పొరేషన్‌లో విలీనం చేసేందుకు కృషి చేశారు. కార్పొరేషన్‌లో విలీనం అయిన వెంటనే ఆ గ్రామం మొత్తం పర్యటించిన డిప్యూటీ మేయరు అభినయ్‌రెడ్డి, గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయాలని అధికారులను కోరారు. స్మార్ట్‌సిటిలో భాగంగా శెట్టిపల్లిని అభివృద్ధి చేసేందుకు పూనుకున్నారు. శెట్టిపల్లి ఇతర ప్రాంతాలకు రోల్‌మోడల్‌గా ఉండేలా తీర్చిదిద్దాలని అభినయ్‌రెడ్డి అధికారులకు సూచించారు. అందులో భాగంగా కార్పొరేషన్ కౌన్సిల్‌లో చర్చించి శెట్టిపల్లి గ్రామ అభివృద్ధికి రూ.రెండు కోట్లకు పైగా నిధులు విడుదల చేసి, సిసి రోడ్లు, గ్రామానికి తెలుగుగంగ నీటి సరఫరా, వీధిలైట్ల మరమ్మతులు, నూతనంగా డ్రైనేజీ కాల్వల నిర్మాణం, వాటర్ హెడ్ ట్యాంక్ మరమ్మత్తులను ఆగమేఘాలపై చేపట్టారు. గ్రామంలో ఏ సమస్య వచ్చిన తాను ముందుండి పరిష్కరిస్తానని డిప్యూటీ మేయర్ ఇచ్చిన హామీతో అక్కడ ప్రజల సంతోషం చిగురించింది.

తాగునీటికి శాశ్వత పరిష్కారం

తిరుపతి ఆధ్యాత్మిక నగరానికి ఆనుకునే ఉన్న శెట్టిపల్లికి గతంలో నీటి సమస్య ఉండేది కాదు. ఇటీవల కాలంలో బోర్లలో సైతం సుద్దనీరే వచ్చేది. తాగేందుకు కూడా పనికి రాకుండా ఉండేది. ఈ నీటిని తాగితే మోకాళ్ల నొప్పులు, కిడ్నీ సమస్యలు, వివిధ రకాల ఇన్‌ఫెక్షన్లు అధికంగా ఉండేవి. ఈ విషయాన్ని గ్రామస్థులతో కలిసి డిప్యూటీ మేయర్ భూమన అబినయ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన వెనువెంటనే కార్పొరేషన్ అధికారులతో చర్చించి, శెట్టిపల్లి నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.60 లక్షల రూపాయలను విడుదల చేశారు. తిరుపతికి వచ్చే తెలుగుగంగ నీటిని శెట్టిపల్లికి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నారు.

-టి.బత్తినబాబు, వైసీపీ డివిజన్ అధ్యక్షులు

రహదారులకు మోక్షం

గ్రామంలో దశాబ్దాల క్రితం వేసిన రోడ్లు మాత్రమే ఉండేవి. దీంతో చిన్నపాటి వర్షం పడినా స్థానికుల రాకపోకలు ఇబ్బంది కల్గేది. పంచాయతీలో నిధుల కొరతతో రోడ్ల అభివృద్ధి పెద్దగా జరగలేదు. కార్పొరేషన్‌లో విలీనం తర్వాత అభినయ్‌రెడ్డి చొరవతో లక్షలాది రూపాయలతో యుద్ధప్రతిపాదికన సీసీ రోడ్ల నిర్మాణం జరిగింది. ఎట్టికేలకు శెట్టిపల్లి రహదారులకు మోక్షం లభించింది. ఇందుకు సహకరించిన ఎంఎల్ఏకి, అభినయ్‌రెడ్డికి, గ్రామ పెద్దలకు కృతజ్ఞతలు.

-కె.రామకృష్ణ, ఉప సర్పంచ్, శెట్టిపల్లి పంచాయతీ

గ్రామానికి మహర్దశ

పేరుకే మేజరు పంచాయతీ. నిత్యం నిధుల లేమి. కార్పొరేషన్ విలీనం అయిన తర్వాత అభినయ్‌రెడ్డి చొరవతో గ్రామానికి మహర్దశ ప్రారంభమైంది. పంచాయతీలో సిసి రోడ్ల నిర్మాణం, వీధిలైట్ల మరమ్మతులు, నీటిట్యాంకు మరమ్మతు, డ్రైనేజీ కాల్వల నిర్మాణం, వినాయకనగర్‌లో సిసి రోడ్లు, ఉప్పరపాళెంలో సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, తెలుగుగంగ వాటరు సరఫరా, ప్రైమరీ హెల్త్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేశారు. తదితర పనులను అధికారులు వేగవంతంగా నిర్వహించి, గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు పూనుకోవడం అభినందనీయం.

-కె.బాలమురళీకృష్ణ, వైసీపీ, పంచాయతీ గౌరవాధ్యక్షులు

జగనన్న కాలనీల మాటున భూదందా

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జగనన్న కాలనీల మాటున భూదందా జరుగుతోందని.. చర్చకు వైసీపీ నాయకులు సిద్ధమా అని ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ఓ ప్రకటనలో సవాల్ విసిరారు. పేదల కాలనీలుగా చెబుతున్న వైసిపి నాయకులు రూ.కోట్లు వెనకేసుకుంటున్నారని ఆరోపించారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు లేక ఇళ్ల మధ్య చెరువులను తలపించేలా ఉన్నాయన్నారు. ఎక్కడో ఊరికి అవతల కొండలు.. గుట్టలను చదును చేసి ప్లాట్లు కేటాయిస్తే అక్కడ ఇల్లు కట్టుకోలేక చాలామంది లబ్ధిదారులు అనాసక్తి చూపుతున్నారన్నారు. మరో పక్క జగనన్న కాలనీలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో భారీ అవినీతి చోటు చేసుకుందని, భూ సేకరణ పేరుతో ప్రభుత్వాన్ని మోసం చేసి వైసిపి నాయకులు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తన శాఖలో ఏం జరుగుతుందో తెలుసుకోకుండా పవన్ కళ్యాణ్ పై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉన్న జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొని వైసిపి అరాచకాలను బయటపెట్టాలని పిలుపునిచ్చారు.

ముఖ్యమంత్రికి పాలాభిషేకం

ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరి ప్రజల తరపున రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ వెంకటగిరి గ్రామశక్తి శ్రీశ్రీశ్రీ పోలేరమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వెంకటగిరి జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించి వెంటనే అమలు చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డిదేనన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ భానుప్రియ, వైస్ ఛైర్మన్ బాలయ్య, వైసీపీ సీనియర్ నాయకులు చెలికం శంకర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలో వైసీపీ తిరిగి అధికారంలోకి రావడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తిరుమల నగర్ పంచాయతీ వైసీపీ అధ్యక్షులుగా నియమితులైన మొదలియార్ రమేష్ స్పష్టం చేశారు. శుక్రవారం తిరుమల నగర్ లో వైసీపీ సీనియర్ నాయకులు గుండ్రాజు శివశంకర్ రాజు ఆధ్వర్యంలో స్థానిక వైసీపీ నాయకులు, వార్డు మెంబర్లు మొదలియార్ రమేష్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, ఉప సర్పంచ్ తిరుమల ప్రసాద్ బాబు, వార్డు సభ్యులు పెద్దన్న, రాము, మోహన్, వరలక్ష్మి, చంద్రమ్మ, మణి, రమేష్ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం



ప్రజాశక్తి-బాలాయపల్లి: రైతుల సంక్షేమమే లక్ష్యంగా పని చేద్దామని డ్వామా ఏపీడీ ప్రభావతి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో రైతు ఉత్పత్తుల సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన రుణాలను వెంటనే రికవరీ చేయించాలని ఆదేశించారు. ఎఫ్‌బీవో పీడీఎం సింగన్న , ఏసీ ఆదినారాయణ, రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిని పరిరక్షిస్తేనే మానవాళి మనుగడ

ప్రజాశక్తి-క్యాంపస్: ప్రకృతిని పరిరక్షిస్తేనే మానవాళి మనుగడ సాధ్యమని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ గంగాధర్‌రావు పేర్కొన్నారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని స్థానిక శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో జంతు శాస్త్ర, వృక్ష శాస్త్ర విభాగం వారు నిర్వహించారు. ప్రకృతి వినాశనానికి మానవుని పాత్రను గురించి పరిణామాత్మక నేపథ్యాన్ని వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ వై.గంగాధర్‌రావు మాట్లాడుతూ ఎప్పుడూ ఆరోగ్యకరమైన ప్రకృతి పర్యావరణం స్థిరమైన, ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని ఆయన వివరించారు. జంతుశాస్త్ర అధ్యాపకురాలు డా. శిరీష మాట్లాడుతూ అడవులు భూమిపైనున్న జీవజాల పరిరక్షణ పూర్తిగా ప్రతి మానవుని బాధ్యతని, విస్మరిస్తే భూమిపై ఉత్పాతాలతో ఈ భూగోళంపై మానవ జీవనానికి ప్రమాదమని, ప్రకృతిని ప్రేమిస్తూ పరిరక్షించాలని పిలుపునిచ్చారు. వక్షశాస్త్ర అధ్యాపకురాలు ఎస్ చంద్రిక బాయి, అధ్యాపకురాలు డి. అనురాధ, ఇంచార్జి ప్రిన్సిపాల్ అధ్యాపకులు డా.వాసుదేవులునాయుడు, ఏ.కే. బాలాజీ, ఈ.లోకేష్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కమర్షియల్ రాకెట్ ప్రయోగానికి సర్వం సిద్ధం

నేటి ఉదయం 5 గంటలకు కౌంట్ డౌన్



ప్రజాశక్తి - సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరో పక్కా కమర్షియల్ రాకెట్ ప్రయోగానికి సిద్ధమయింది.ఈనెల 30న ఉదయం 6:30 గంటలకు పిఎస్ఎల్వి సి-56 రాకెట్ ను ప్రయోగిస్తున్నారు. ఈ రాకెట్ ద్వారా సింగపూర్‌కు చెందిన ఏడు ఉపగ్రహాలను అంతరిక్ష కక్షలోకి పంపుతున్నారు. డిఎస్- సార్ శాటిలైట్ ఇందులో ప్రధానమైనది. ఇది కాకుండా వెలాక్స్ ఏఎం, ఆర్కేడ్, స్కూబ్-2,నులియన్, గెలాసియా-2, ఓఆర్ బి-12 ఉపగ్రహాలను ప్రయోగిస్తున్నారు. ఇందుకు సంబంధించి శ్రీహరికోటలో ఉదయం పూట రాకెట్ ప్రయోగాన్ని వీక్షించడానికి సందర్శకులను ఆహ్వానించారు. ఇప్పటికే ఆన్లైన్ ద్వారా పేర్లు నమోదు చేసుకున్నారు. పిఎస్ఎల్వి సి- 56 రాకెట్ పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సిరీస్ లో 58 వది.శ్రీహరికోటలోని మొదటి ప్రయోగ వేదికపై లాంచ్ రిహార్సల్స్ కొనసాగాయి. నాలుగు దశల పీఎస్ఎల్వీ రాకెట్ ను ఈసారి స్ట్రాపాన్ బూస్టర్లు లేకుండా కోర్ అలాన్ తరహాలో రూపొందించారు. ప్రస్తుతం ఉపగ్రహాలను రాకెట్ శీర్ష భాగంలోని హిట్ ఫీల్డ్ మధ్య అమర్చారు.శుక్రవారం లాంచ్ ఆథరైజేషన్ బోర్డు, మిషన్ రెడీనెస్ రివ్యూ సమావేశంలు నిర్వహించారు. ఈనెల 30న ఉదయం 6.30 గంటలకు రాకెట్ ను ప్రయోగించినట్లు ఇస్రో అధికారికంగా ప్రకటించింది. రాకెట్ ప్రయోగానికి ముందు 25.30 నిమిషాల పాటు కౌంట్ డౌన్ నిర్వహిస్తారు.నేటి ఉదయం 5 గంటల నుంచి కౌంట్ డౌన్ ప్రక్రియ ప్రారంభించి పిఎస్ఎల్వీ సి-56 రాకెట్ ద్రవ ఇంధన దశను నింపుతారు.ఈ ప్రయోగం ద్వారా భారత్ కు లాభాలు అర్జించే అవకాశం ఉంది.

ఎంబీబీఎస్ విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) యూనివర్శిటీ, శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల ఫిజియాలజీ విభాగం వారిచే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎంబీబీఎస్ విద్యార్థులకు రాష్ట్ర స్థాయి ఫిజియాలజి హయగ్రీవ - 2023 క్విజ్ పోటీలను నిర్వహించారు. సైనిక శ్రీ పద్మావతి మెడికల్ కళాశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమాన్ని రిజిస్ట్రార్ డాక్టర్. అపర్ణ బిట్లా, ప్రిన్సిపల్ డాక్టర్.శరన్ బి సింగ్, వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్. ముక్తేశ్వరయ్య, డాక్టర్. నాగరాజు, డాక్టర్.ఉమామహేశ్వర రావు జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. కాంపిటీషన్లో 42 మంది విద్యార్థులు, 14 టీంలుగా ఏర్పడి, ఈ క్విజ్ పోటీలకు హాజరయ్యారు. ఈ రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలలో మొదటి స్థానాన్ని కుప్పం పి.ఈ.ఎస్ మెడికల్ కళాశాలకు చెందిన విద్యార్థులు ధార్మిక శ్రేష్ఠ, మహేంద్రరెడ్డి, సాయి జాహ్నవి, రెండో స్థానంలో స్విమ్స్ శ్రీ పద్మావతి మహిళా వైద్యకళాశాలకు చెందిన విద్యార్థులు భావన పండెయ్, ఫాగున్ బెల్, హారిక, తతీయ బహుమతిని స్విమ్స్ శ్రీ పద్మావతి మహిళా వైద్యకళాశాలకు చెందిన విద్యార్థులు అనూష, తనీషా నేత్ర, రీట్ ఆరోరా గెలుపొందారు. పద్మావతి ఫిజియాలజీ వైద్యులు, అధ్యాపకులు, వివిధ వైద్య కళాశాలలకు చెందిన ఫిజియాలజీ వైద్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏరియల్ సర్వేపై విద్యార్థులు పట్టు సాధించాలి

ఐఐటీలో లాడార్ ఏరియల్ సర్వేపై అవగాహన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: విద్యార్థులు మ్యాపింగ్, ఏరియల్ సర్వే, ల్యాడర్ తదితర వాటిపై పట్టు సాధించాలని ఆర్వే అసోసియేట్స్ డైరక్టర్ బీవీ రెడ్డి పిలుపునిచ్చారు. ఐఐటి తిరుపతిలో శుక్రవారం ఏరియల్ సర్వే, మ్యాపింగ్, ల్యాడర్ తదితర వాటిపై విద్యార్థులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులను హెలికాప్టర్ వద్దకు తీసుకెళ్లి సర్వే గురించి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు రక్షా పథకంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా హెలికాప్టర్‌తో ఖచ్చితమైన సర్వేను చేస్తున్నట్లు చెప్పారు. దేశంలో ఎన్నో ప్రాజెక్టులు చేసినప్పటికీ ఈ స్థాయిలో మొదటి నుంచి చివరి వరకు భూ సర్వే చేసిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని చెప్పారు. దాదాపు తిరుపతి జిల్లాలో సర్వే పూర్తికావస్తోందని ఇప్పటికే తమ సంస్థ ఆధ్వర్యంలో సత్యసాయి జిల్లా, అనంతపురం జిల్లాల్లో పూర్తిచేశామని తిరుపతి జిల్లాలో కూడా అతిత్వరలో పూర్తిచేస్తున్నట్లు చెప్పారు. సర్వే పూర్తయితే భవిష్యత్తులో భూ సమస్యలు వచ్చే అవకాశం దాదాపు ఉండదని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి ఒక్కరూ వినియోగించుకోవచ్చని చెప్పారు. ఏదైనా హద్దులు ఒక చిన్నసెల్ ఫోన్, కంప్యూటర్ తో ఎవరైనా ఎక్కడ నుంచి అయినా సర్వే పరిశీలించుకో వచ్చున్నారు. ఈ సర్వే పూర్తయిన వెంటనే ప్రతి ఒక్కరికీ వారి భూ హద్దులను రికార్డుల రూపంలో ప్రభుత్వం ప్రకటిస్తుందన్నారు. దీని వల్ల రైతులకు ఎంతో గాను ఉపయోగం ఉంటుందని.. ప్రభుత్వానికి కూడా ఏ ప్రాంతంలో ఎంత మేరకు భూమి ఉంది.. వినియోగం తదితర వాటిపై వివరాలు అందుబాటులో ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించే కాకుండా దేశంలో వివిధ విభాగాలకు ఈ డేటాను వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. ఐఐటీ తిరుపతి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ రామకష్ణ గొర్తి ఐఐటీ తిరుపతి నవవిష్కార్ ఐ హబ్ ఫౌండేషన్ సంస్థ గురించి వివరించారు. హబ్ ఆధ్వర్యంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని నాలుగు విభాగాల్లో అవకాశాలు కల్పించనున్నట్లు వివరించారు.

విద్యతోనే దేశాభివృద్ధి

ప్రజాశక్తి-చిల్లకూరు: విద్యతోనే దేశం అభివృద్ధి చెందుతుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నాగార్జున అన్నారు. శుక్రవారం చిల్లకూరులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సుమారు రూ.రెండు కోట్లతో నిర్మించిన గదులను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్సీ మేరీగ మురళీధర్ మాట్లాడుతూ విద్యార్థులు సంకల్పంతో చదువుకోవాలన్నారు. ఎమ్మెల్యే వరప్రసాద్, ఎమ్మెల్సీ కళ్యాణ్, ఆర్డీవో కిరణ్ కుమార్, సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ దేవసేనమ్మ, జడ్పిటిసి శ్రీనివాసులు, ఓడూరు సర్పంచ్ నాగిశెట్టి శారదమ్మ, ఎంపీటీసీలు, ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ రాయలసీమతోనే సమగ్రాభివృద్ధి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాయలసీమ ప్రాంతం సమగ్రాభివృద్ధి చెందాలంటే మిషన్ రాయలసీమతోనే సాధ్యమవుతుందని, రాయలసీమ సమగ్రాభివృద్ధి కోసం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రత్యేక ప్రణాళికను రూపొందించి మిషన్ రాయలసీమను ప్రకటించారని తెలుగు యువత రాష్ట్ర నాయకులు ఆర్ పి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం తిరుపతి నగర పరిధిలోని బస్టాండ్ సమీపంలో దుకాణదారులకు, ఆటో యూనియన్ నాయకులకు, చిన్నపాటి వ్యాపారులకు మిషన్ రాయలసీమ విశిష్టతను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత తిరుపతి పార్లమెంటు నాయకులు శ్రీనివాస యాదవ్, యువత అధ్యక్షుడు కరణం సందీప్, అరుణ్, గోపీకృష్ణ, వరుణ్, మురళి, వెంకట్ రెడ్డి, మనోజ్, నాగేంద్ర, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-బాలాయపల్లి: రీ సర్వే నిర్వహణ, ఓటర్ల నమోదుపై రెవెన్యూ సిబ్బంది, బీఎల్ వోలు బాధ్యతగా ఉండాలని.. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక తహశీల్దారు కార్యాలయ ఆవరణలో అదనపు భవనం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే వేగవంతం చేయాలన్నారు. పోలింగ్ కేంద్రం బూతు లెవలో అధికారులు ప్రత్యేక నిఘా ఉండాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో రవీంద్రబాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పూర్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సేవ్ నేచర్ నినాదంతో హైకోర్టుని ఆశ్రయిస్తా

ప్రజాశక్తి-క్యాంపస్: ఇటీవల కాలంలో మాస్టర్ రోడ్డు ప్లాన్‌లో భాగంగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 80 అడుగులు, 100 అడుగుల మూడు రహదారులను నిర్మించాలని ప్రతిపాదన వర్సిటీ ఉనికిని కోల్పోయేలా చేస్తుందని రాయలసీమ పోరాట కమిటీ సమితి కన్వీనర్ నవీన్ కుమార్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కే. రాజారెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతరకు రాష్ట్రస్థాయి గుర్తింపు

ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ముఖ్యమంత్రి ప్రకటించడం హర్షణీయమని మున్సిపల్ ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశాన్ని ఆమె అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ శాఖ ఛైర్‌పర్సన్ శారదా, వైస్ ఛైర్మన్ బాలయ్య, ఉమామహేశ్వరి, కౌన్సిలర్లు సుబ్బారావు, శేఖర్, శంకరయ్య, కళ్యాణి, గురువమ్మ, వహీదా, రాధమ్మ, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర రవాణాశాఖ సభ్యుడిగా సునీల్ చక్రవర్తి బాధ్యతలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర రవాణాశాఖ సభ్యుడిగా ఎన్నికైన ముత్తంశెట్టి సునీల్ చక్రవర్తి శుక్రవారం రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్, ఛైర్మన్ మనీష్‌కుమార్ సిన్హా సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. సునీల్‌చక్రవర్తి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎంతో నమ్మకంతో బాధ్యతను అప్పగించారని, రవాణాశాఖ అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీధర్ రావు, జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కాపు సంక్షేమ ఛైర్మన్ అడపా శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE ::GUDUR
O.S. No. 153 / 2019

S.B.I Gudur
Rep.by its Chief Manager, ...వాది
Vs
K. Ramesh Babu and other .....ప్రతివాదులు
To
1. కేదరి రమేష్ బాబు, S/o రాఘవేంద్రరావు, Senior Asst. in the office of Asst. Director of Fisharies, Narasingarao peta, Gudur Town, Tirupati (Dt).
2. గోను రఘు బాబు, S/o లేట్ తిరుపాలు, Field Man in office of Asst. Director of Fisharies Narasingarao peta, Gudur Town,Tirupati (Dt).

నోటీసుల నిమిత్తం

పై కోర్టు నందు పైన తెలుపబడిన దావాలో వాది తమకు రావల్సిన బాకీ కొరకు దావా వేసియున్నారు. ఆ దావా తేది.22-08-2023 నాటికి వాయిదా వేసియున్నారు. కావున తేది. 22-08-2023 ఉదయం 10.30 నిమిషాలకు పై కోర్టు ఎదుట ప్రత్యక్షముగా గానీ, మీ తరపున న్యాయవాది గానీ హాజరు కావల్సివుంది. లేనియెడల కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానించెదరు. ఇది కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం జారీ చేయడమైనది.

ఇట్లు,
వాది తరపున న్యాయవాది
K. VENKATA KRISHNAIAH, B.A., B.L., ADVOCATE, 2-220, Narasingarao peta, Gudur - 524101, Tirupati Dist. A.P Cell : 9440113977